## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో పడిపూజ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

ఆదోనిఅర్బన్: స్థానిక ఎస్‌కేడీ కాలనీలో వెలిసిన అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పంచామృతాభిషేకం, 18 మెట్లకు ప్రత్యేక అలంకరణతో పడిపూజ చేశారు. భక్తి గీతాల ఆలాపన, భజనల చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక పూజలు



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించారు. భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### రేపు దొడ్జెబాల్ ఎంపిక పోటీలు

ఆదోని సెంట్రల్: జాతీయస్థాయిలో జరిగే దొడ్జెబాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్, జూనియర్స్ జట్లకు సంబంధించి ఈ నెల 9వ తేదీన ఎంపిక పోటీలు నిర్వహిస్తామని రాష్ట్ర దొడ్జెబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబిరెడ్డి, కార్యదర్శి సాబీర్ అహ్మద్ గురువారం తెలిపారు. ఈ పోటీలు హర్యానా రాష్ట్రంలో జనవరి 5 నుంచి7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనదలచిన వారు 2007 జనవరి తరువాత జన్మించిన వారై ఉండాలని, జూనియర్స్ విభాగంలో పాల్గొనే వారు 2005 జనవరి తరువాత జన్మించి ఉండాలని చెప్పారు. ఎంపిక పాఠశాల స్కూల్ ఆవరణ (విజయలక్ష్మీ నర్సింగ్ హోమ్) దగ్గర ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు 9న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ 7013563203 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### హుండీ సొమ్ము చోరీ

కోసిగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుటనున్న సత్యమ్మవ్వ దేవాలయంలోని హుండీలోని సొమ్మును గుర్తు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. భక్తులు కానుకలు సమర్పించేందుకు ఆలయం ఎదుట హుండీ ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ఆవరణలోనున్న మంచి నీటి బోరు నుంచి నీటిని పట్టుకునే వారు బిందెకు రూ.5ప్రకారం హుండీలో వేస్తారు. మూడు నెలలుగా హుండీని తెరవలేదు. అందులో రూ.10వేల వరకు ఉంటుందని భక్తులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు హుండీ తాళం పగులగొట్టి నగదును అపహరించుకెళ్లారు.

### పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఆదోనిరూరల్: పేదల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అన్యభాషా కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్, ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ తెలిపారు. గురువారం వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమం మండలంలోని దిబ్బనకల్, సలకలకొండ గ్రామాల్లో సర్పంచ్ లక్ష్మన్న, భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం జరిపించారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మణికంఠ, శ్రీకాంత్, ఏఓ శేఖర్, ఈఓపీఆర్డీ నాగరాజు పాల్గొన్నారు.

### బహుమతుల అందజేత



పెద్దకడబూరులో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం స్థానిక మెయిన్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఎంఈఓలు సువర్ణల సునియం, రామ్మూర్తి మాట్లాడుతూ దివ్యాంగులు అందరితో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం గత వారం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కర్నూలులో నిర్వహించిన దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కిడ్నీ రోగులకు బాసట

- ఆదోని ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో డయాలసిస్ సేవలు
- అధునాతన సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం
- నాణ్యమైన సేవలకు పురస్కారం
- డయాలసిస్ రోగులకు రూ.10 వేల పింఛన్ ఇస్తున్న సర్కారు
- ఉచిత వైద్యంతో బాధితులకు ఊరట

పత్తికొండ మండలానికి చెందిన సురేష్ అనే వ్యక్తి 15 యేళ్ల నుంచి డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో కర్నూలులో మాత్రమే చికిత్స చేస్తుండటంతో అక్కడికి వెళ్లడానికి ఇబ్బందులు పడేవారు. అయితే 2018లో ఆదోనిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడే చికిత్స చేయించుకుంటున్నాడు. ఆదోనిలో అధునాతన పరికరాలు, మంచి వైద్యసేవలు అందుతుండడంతో ఇప్పటివరకు తాను బాగానే ఉన్నానని చెబుతున్నాడు. అలాగే టీడీపీ హయాంలో తమకు నెలకు రూ.5వేలు ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.10వేలు ఇస్తుండటంతో ఆర్థిక ఇబ్బందులు తప్పాయని పేర్కొంటున్నాడు. సురేష్‌తో పాటు మరో పది మంది కూడా పది హేనేళ్ల నుంచి వైద్యం చేయించుకుంటున్నారని వైద్యులు తెలిపారు.



ఆదోనిలో చికిత్స పొందుతున్న రోగులు

ఆదోనిఅర్బన్: ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు బాసటగా నిలుస్తోంది. 2018 సెప్టెంబర్‌లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సౌకర్యాలు కల్పించింది. దీంతో మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది.

**నెలకు వెయ్యి మందికి డయాలసిస్..**

ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సత్వర వైద్యసేవలు అందుతున్నాయి. సెంటర్ ప్రారంభమైనప్పటి నుంచి 368 మంది రోగులు వైద్యసేవలు పొందారు. వారిలో ప్రస్తుతం 100 మంది రోగులు మిగిలారు. 200 మంది వ్యాధి నుంచి విముక్తి పొందారు. 68 మందిలో కొందరు స్వగ్రామాలు వదిలేసి వెళ్లినవారు, మరికొందరు దగ్గరలోని ఇతర కేంద్రాల్లో చికిత్సలు పొందడం, మరికొంతమంది చనిపోయారని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం రోజుకు 38 మందికి డయాలసిస్ చేస్తున్నారు. నెలకు వెయ్యి మందికి పైగా రోగులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. అంతేగాకుండా 60 మంది వ్యాధిగ్రస్తులకు వారానికి మూడుసార్లు, 40 మందికి వారానికి రెండుసార్లు డయాలసిస్ చేస్తున్నామంటున్నారు.

**బాధితులు తప్పిన ఇబ్బందులు..**

గతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేసుకునేందుకు ఎంతో ఇబ్బందులు పడ్డారు. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలకు కలిపి కర్నూలులో మాత్రమే డయాలసిస్ సెంటర్ ఉండేది. మూడు జిల్లాల వ్యాధిగ్రస్తులు కర్నూలులోని ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకునేవారు. మరికొంతమంది ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించేవారు. దీంతో చాలా మందికి దూరాభారం కావడంతో రాలేకపోయేవారు. దీంతో వ్యాధి తీవ్రతతో ఇబ్బందులు పడ్డారు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ఆదోనిలో మరో కేంద్రాన్ని 2018లో ఏర్పాటు చేసింది. దీంతో వ్యాధి గ్రస్తులకు ఊరట లభించింది.


**ప్రతినెలా రూ.10 వేల పింఛన్**

టీడీపీ హయాంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.5 వేలు పింఛన్ ఇచ్చేవారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోగులకు ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి వచ్చాక రూ.10 వేలు పింఛన్ అందిస్తున్నారు. గతంలో ఇచ్చే మొత్తం రానుపోను చార్జీలు, మందులు ఖర్చులకు సరిపోయేవి కాదు. అయితే ప్రస్తుతం మందులు, ఖర్చులకు ఇబ్బందులు తప్పాయని బాధితులు పేర్కొంటున్నారు.

**12 మందితో సేవలు..**

ప్రభుత్వ ఆదోని ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో ఒక రెగ్యులర్ డాక్టర్, ఇన్‌చార్జ్ డాక్టర్, ఏడుగురురు డయాలసిస్ సిబ్బంది, ముగ్గురు క్లీనిక్ సిబ్బందితో వ్యాధిగ్రస్తులకు అత్యుత్తమైన సేవలు అందిస్తున్నారు.

**నాణ్యమైన సేవలతో ఆదోని సెంటర్‌కు అవార్డు వచ్చింది**



డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు ఉత్తమమైన సేవలందించడంతో 2022లో ఆదోని డయాలసిస్ సెంటర్‌కు బెస్ట్ డయాలసిస్ క్లినిక్ అవార్డు లభించింది. నాణ్యతతో కూడిన, నిరంతరాయంగా సేవలందించడంతోనే దేశంలో ఉన్న 130 డయాలసిస్ సెంటర్లు పోటీ పడగా ఆదోనికి పురస్కారం దక్కింది. 350 మంది వ్యాధిగ్రస్తుల్లో 200 మంది వ్యాధి నుంచి కోలుకున్నారు. ప్రస్తుతం వంద మందికి చికిత్స చేస్తున్నాం. నెలకు వెయ్యి మందికి పైగా డయాలసిస్ చికిత్స అందిస్తున్నాం. – డాక్టర్ రాజు, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జ్



ఆదోని డయాలసిస్ సెంటర్‌కు వచ్చిన అవార్డులు

## క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

కౌతాళం: ఆడుదాం ఆంధ్ర పోటీల ద్వారా క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బాపురం గ్రామ ఇన్‌చార్జ్ గురునాథ్‌రెడ్డి, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సావిత్రి అన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మండలంలోని బాపురం గ్రామ జెడ్పీ పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికే పోటీలను నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈనెల 15వ తేదీ నుంచి జరుగు పోటీల్లో అందరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అబ్దుల్‌వాహిద్, నాయకులు జైపాల్, అయ్యప్పరెడ్డి, దేవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, పీఈటీ శేషు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు వేగవంతం చేయండి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్బారాజు

కౌతాళం: ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను మరింత పెంచాలని సూచించారు. కూలీలు వలసలు పోకుండా చూడాలని ఆదేశించారు. లేబర్ రిపోర్టింగ్, హార్టికల్చర్ కార్యక్రమాలు, చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణం, కమ్యూనిటీ సోక్ పిట్స్ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఏపీఓ జుబేర్‌అహ్మద్‌ను ఆదేశించారు. మండలంలో మరింతగా ఉపాధి పనులను చేపట్టాలని చెప్పారు. ఇంజినీరింగ్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి



పెనుమాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

కృష్ణగిరి: అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని పెనుమాడ, కంబాలపాడు, గుడెంపాడు, బాపనదొడ్డి గ్రామాల్లో గురువారం సాయంత్రం ఎస్‌ఐ సురేష్‌తో కలిసి సీఐ పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించమన్నారు. ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించినప్పుడే గ్రామాలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ ఉందని, పంతాలు, పట్టింపులకు పోకుండా రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

## దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



వెల్దుర్తి భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన ఎంఈఓ రమేశ్

వెల్దుర్తి(కృష్ణగిరి): వినికిడి, దృష్టిలోపం దివ్యాంగ విద్యార్థులకు సులువుగా విద్య అభ్యసించేందుకు వీలుగా ప్రభుత్వం ట్యాబ్‌ల పంపిణీ చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం స్థానిక ఎంఆర్‌సీలో మండలంలోని 8మంది విద్యార్థులకు ఎంఈఓ-2 రమేశ్ చేతుల మీదుగా రూ.1,20,000 విలువగల ట్యాబ్‌ల పంపిణీ జరిగింది. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న భవిత కేంద్రంలో ముగ్గురు, రామళ్లకోట, వెల్దుర్తి హరిజనవాడ మెయిన్‌స్కూల్, వెల్దుర్తి బాయ్స్ హైస్కూల్‌లో ఒక్కొక్కరు, పుల్లగుమ్మి హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను ఉపయోగించుకుని విద్యార్థులను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు అరుణ, స్వరూపారాణి, బాలుర హైస్కూల్ ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయుడు నర సింహులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## కోలుకోలేక వ్యక్తి మృతి

చిప్పగిరి: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన కుందన గుర్తి గ్రామానికి చెందిన కేసరి నారాంజనేయులు (28) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. గుంతకల్లు పట్టణంలోని ఆంజనేయ స్వామి కూడలిలో గత మంగళవారం కడప ప్రాతానికి చెందిన మస్తాన్ ద్విచక్ర వాహనం, కేసరి నారాంజనేయులు ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన కేసరి నారాంజనేయలును మొదట అనంతపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక గురువారం ఉదయం మరణించాడు. మృతుడికి భార్య రాణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

కౌతాళం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక నేతలతో కలిసి సచివాలయం-1 పరిధిలోని వైఎస్సాఆర్ నగర్, మంచాల వీదుల్లోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, కుటుంబాలకు కలిగిన ప్రయోజనలను వివరించారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ సర్పంచ్ అవతారం, పీఎంసీ చైర్మన్ వడ్డె రాము, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, నాయకులు అబ్దుల్‌సమద్, భీమేష్, కార్యదర్శులు చెన్నయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

# సంక్షేమ సారథికి మద్దతునిద్దాం



7వ వార్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించిన దృశ్యం



కునిమొహల్లా వీధిలో అభివృద్ధి ఫలాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన దృశ్యం



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు

ఆదోనిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నకే ఓటు వేసి సంక్షేమ సారథికి అండగా నిలుద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, జేసీఎస్ కన్వీనర్లు నరసింహులు, ఫయాజ్ పిలుపునిచ్చారు. ప్రజాశీస్సులు పొందిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కునిమొహల్లా ఏరియా, 23వ వార్డు కల్లుబావి ప్రాంతాల్లో నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరణ, అనంతరం అభివృద్ధి ఫలాల డిస్‌ప్లే బోర్డులను ప్రారంభించారు. ఆయా కాలనీల్లో ర్యాలీలు చేపట్టారు. ఆయా సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. ప్రతిపక్షాలు చెప్పే మాటలను నమ్మవద్దని, గత ప్రభుత్వం, జగనన్న పాలనకు గల తేడాను గమనించాలని ప్రజలను కోరారు.



సాతనూరులో వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అవి కొనసాగాలంటే మరోసారి ఆయనను సీఎంగా గెలిపించుకోవాలని జేసీఎస్ మండల కన్వీనర్ పి. మురళీమోహన్ రెడ్డి కోరారు. గురువారం మండలంలోని సాతనూరు సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా తుంబిగనూరు గ్రామంలో సర్పంచ్ వారం ఈరన్న, సాతనూరు గ్రామంలో సర్పంచ్ మంగమ్మతో కలిసి గ్రామ ప్రధాన రోడ్డులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ కార్యాలయంకు వరకు ర్యాలీగా వెళ్లి సంక్షేమ పథకాలు డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు. అభివృద్ధే లక్ష్యంగా జగనన్న అడుగులు ముందుకు వేస్తున్నాడన్నారు. కౌన్సిలర్లు ఉస్మాన్‌బాషా, గోవిందు, నాయకులు ఎక్బాల్, బాషా, జావిద్, హజరత్ భాను, గణేష్, స్వామిదాస్, మహాదేవ, జయరాం, రామాంజి, సూర్యప్రకాష్, నాగేంద్ర, సింహం నాగేంద్ర పాల్గొన్నారు.

### బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా సాయికుమార్

ఆదోనిఅర్బన్: బీజేపీ ఆదోని పట్టణ అధ్యక్షుడిగా జిందే సాయికుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ గురువారం ఆదేశాలు జారీ చేశారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని,నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### రక్తదానం



రక్తదానం చేస్తున్న వెంకటరమణ

ఆదోని సెంట్రల్: అత్యవసర పరిస్థితిలో పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామాంజనేయులు, బసవరాజుకు ఏబీ పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. దీంతో వైద్య సిబ్బంది సూచనల మేరకు బాధితుల బంధువుల వెంకటరమణను సంప్రదించగా ఆయన వచ్చి రక్తదానం చేశారు. కాగా వెంకటరమణకు నేటితో 80 సార్లు రక్తదానం చేశాడు. ఆయనను బాధితుల బంధువులు, వైద్యులు అభినందించారు.

### మంగరాయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆదోనిఅర్బన్: పట్టణ శివారు మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామికి గురువారం ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో పూజారి గురురాజా ఆచారి స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, తేనాభిషేకం, క్షీరాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

### జయప్రదం చేయండి

కౌతాళం: ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు కర్నూల్‌లో జరిగే ఏపీకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే సమావేశాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. నరేంద్రమోదీ తెచ్చిన మూడు కీలక చట్టాలను తిప్పికొట్టడంలో సంఘం కీలకపాత్ర పోషించిందని చెప్పారు. సమాశాలను తొలిసారి కర్నూలులో నిర్వహిస్తున్నారని భారీగా తరలిరావాలన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



ఇంటింటా కుళాయిల శిలఫకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోసిగి: గ్రామాలాభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నేలకోసిగి గ్రామంలో సర్పంచ్ పశువుల హనుమంతమ్మ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ కింద రూ.13.18లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయిలను ప్రారంభించారు. ముందుగా గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి శిలఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాతికేళ్లుగా నెలకొన్న మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక నేలకోసిగి గ్రామాన్ని కొత్తగా పంచాయతీగా ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- ఆర్డీఓ రామలక్ష్మి



కృష్ణగిరిలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

కృష్ణగిరి: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని 15 గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇబ్బందులు కలిగే పోలింగ్ స్టేషన్లను అదే గ్రామంలో సౌకర్యంగా ఉండే ప్రదేశానికి మార్చేందుకు నివేదికలు పంపుతామన్నారు. రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి ఓటు వేసే గ్రామాల్లో కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కూడా ప్రణాళికలు తయారుచేసి ఎన్నికల కమిషన్‌కు పంపుతున్నామని చెప్పారు. మండలంలో ఇది వరకు 40పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇప్పుడు రెండు కిలోమీటర్లు వెళ్లి ఓటుహక్కు వేసే గ్రామాల్లో మరో నాలుగు కేంద్రాలు ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ నెల 9 వరకు 18ఏళ్లు నిండిన వారందరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ రాజేశ్వరి, సర్వేయర్ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

### నేటినుంచి సుబ్రహ్మణ్యేశ్వర షష్టి ఉత్సవాలు

మద్దికెర : స్థానిక మద్దమ్మ చెరువు కట్ట మీద వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాలు 17 నుంచి 19 వతేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ గురువారం తెలిపారు. 17వతేదీ ఉదయం గణపతిపూజ, సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తి ఊరేగింపు కార్యక్రమం, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా 18 వతేదీ ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం సాయంత్రం ప్రభోత్సవ ఊరేగింపు ఉంటుందని, 19న స్వామి వారికి అష్టోత్తర నామార్చన, రాత్రి తెనాలి నటులచే ఆణిముత్యములు నాటక ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

### వేలంపాటల్లో పెరిగిన ఆదాయం

మద్దికెర : మండల పరిధిలోని పెరవలిలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ఏడాది పాటు టెంకాయలు విక్రయించుకునేందుకు గురువారం దేవాదాయ శాఖా ధికారుల ఆధ్వర్యంలో టెంకాయలు, తమలపాకులు వేలం పాటలు నిర్వహించారు. రూ.10.55 లక్షలకు వేలంపాడి రవి అనే వ్యక్తి దక్కించుకున్నారని చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తలనీలాలతో పాటు కందిబేడలు, కొబ్బరి చిప్పలు వేలపాలం పాటలు ఈనెల 21వ తేదీ నిర్వహిస్తామన్నారు.

### కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన బడేసాబ్ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి గురువారం తెలిపారు. బడేసాబ్ తన ఇంటి వద్ద ఓసీ 90 ఎం.ఎల్. పరిమాణం గల టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని అతని నుంచి 123 ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.